## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



పరిగి, ఏప్రిల్ 8: ఇఫ్తార్‌విందులు మత సామరస్యానికి ప్రతీక అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పరిగిలోని ఆయన నివాసంలో ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల వారు శాంతియుత జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పాంబండపై కిక్కిరిసిన జనం



కులకచర్ల, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ శ్రీ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా అగ్నిగుండాల కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వీక్షించారు. దేవాలయ ఈవో సుధాకర్, చైర్మన్ నర్సమ్మా రాములు భజనలు, కీర్తనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బైక్ పైనుంచి పడి మహిళ మృతి

బషీరాబాద్, ఏప్రిల్ 8 : బైక్ పైనుంచి పడి మహిళ మృతి చెందింది. బషీరాబాద్ ఎస్సై రమేశ్ కథనం పకారం.. మండల పరిధిలోని తౌర్యానాయక్‌తండాకు చెం దిన తారీబాయి (36) కుటుంబ సభ్యులతో కలిసి తల్లివారి గ్రామమైన బొందెం పల్లితండా (కర్ణాటక)కు ఆదివారం రెండు బైక్‌లపై బయలు దేరారు. మార్గ మధ్యంలో నవల్గా గ్రామం దాటిన తర్వాత బైక్‌పై కూర్చున్న తారీబాయి హన్‌మాన్ గుడి వద్ద స్వామి వారికి నమస్కరించేందుకు రెండు చేతులు వదలడంతో ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందనదని ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త జాదవ్ సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.










# షడ్రుచుల ఉగాది

- క్రోధినామ సంవత్సరానికి స్వాగతం
- ముగిసిన శోభకృత్‌నామ సంవత్సరం
- నేడు తెలుగు ప్రజల పర్వదినం
- ఆలయాల్లో పండితులతో పంచాంగ శ్రవణం
- కవి సమ్మేళనాలు..సాంస్కృతిక కార్యక్రమాలు
- కొత్త పనులకు శ్రీకారం..

బొంరాస్‌పేట, ఏప్రిల్ 8 : తెలుగు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగల్లో ఉగాది ముఖ్యమైనది. తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. దీంతో ఇది తెలుగు వారి పండుగగా గుర్తింపు తెచ్చుకున్నది. చైత్ర మాసం నుంచే తెలుగువారికే కాకుండా మరాఠీలు గుడిపడ్వాగా, తమిళులు, మలయాళీలు, సిక్కులు, బెంగాలీలు వివిధ పేర్లతో కొత్త ఏడాదిని పండుగగా జరుపుకొంటారు. చైత్రశుద్ధ పాడ్యమి రోజు వచ్చే ఉగాది పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కొత్త ఏడాదిలో రాశి ఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహ శాంతులు లాంటివి జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. కొత్త పనులను ఉగాది రోజు ప్రారంభిస్తారు. మంగళవారం శోభకృత్‌నామ సంవత్సరానికి ముగింపు పలికి క్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలకడానికి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

### కొత్త చిగురు తొడిగే..

శిశిర రుతువు ముగిసి చెట్లకు కొత్త చిగురు తొడిగే వసంత రుతువు సమయంలో వచ్చే ఉగాది పండుగ తెలుగు ప్రజలకు ఎంతో ముఖ్యమైనది. ఈ పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొంటారు. తమ ఇండ్లకు సున్నాలు, రంగులు జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రజలు నరసింహస్వామిని ఇంటి దేవుడి గా పూజిస్తారు. ఉగాది పండుగకు ముందే జల్లి ఉత్సవాలు నిర్వహిస్తారు. పిల్లలు పెద్దలు కొత్త బట్టలు ధరించి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. కొత్తగా చిగురించిన మోదుగ, మర్రి ఆకులతో విస్తరాకులను తయారు చేసి పోలేలు, పచ్చడిని గ్రామ దేవతలకు, ఇండ్లల్లో దేవుళ్లకు నైవేద్యం పెడతారు. యాసంగిలో సాగు చేసిన వరి పంట అకాల వర్షాల భారిన పడకుండా చేతికి రావాలని ప్రార్థిస్తారు.

ఉగాది పండుగ రోజు చేసే ముఖ్యమైన వంటకం పచ్చడి. షడ్రుచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. సాయంత్రం ఆలయాల ఆవరణల్లో చలువ పందిళ్లలో పండితులతో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ప్రజలు తమ పేర్లమీద జాతకాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడంతో పాటు కొత్త ఏడాదిలో వర్షాకాలం ఎలా ఉంటుందో రైతులు పండితులను అడిగి ఆత్రుతతో తెలుసుకుంటా రు. పూర్వ కాలంలో ఉగాది ఉంటే గ్రామాల్లో చిన్నా పెద్దా వ్యవసాయ పొలాలు, ఇళ్ల వద్ద తాళ్లతో ఊయలలు కట్టి



ఊరేగేవారు. వివిధ రకాల ఆటలు ఆడేవారు. ఇప్పుడవన్నీ గ్రామాల్లో కనుమరుగయ్యాయి. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే క్రోధినామ సంవత్సరం జిల్లా ప్రజలకు శుభాలు కలుగజేయాలని ఆశిద్దాం.

### ఉగాదిలో ఉగ అంటే నక్షత్ర గమనం

షాద్‌నగర్‌టౌన్ : హిందువులు జరుపుకొనే పర్వదినాల్లో ఉగాదికి ప్రత్యేకత ఉంది. ఈ పండుగ రోజున ప్రతి ఇల్లు పచ్చని మామిడి తోరణాలతో కళకళలాడుతుంటాయి. ఉదయమే తమ ఇష్టదైవాలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. షడ్రుచులతో కూడిన పచ్చడిని తయారు చేసి దేవుళ్లకు నైవేద్యంగా పెడుతారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతుందనని సాయంత్రం సమయాల్లో ఆలయాల వద్దకు వెళ్లి అర్చకులు చెప్పే పంచాంగ శ్రవణాన్ని వింటారు. ప్రతి ఏడాది చైత్ర శుద్ధ పాడ్యమి రోజున జరుపుకొనే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని వేద పండితులు అభిప్రాయపడుతున్నారు. చంద్రమానం ప్రకారం చైత్రమాసంలో వచ్చే పండుగ ఉగాది. రుతువుల్లో వసంత రుతువు ప్రారంభం అవుతుంది. ఈ పాడ్యమి నుంచి వసంత నవరాత్రులు ప్రారంభం అవుతాయి. ఉగాది రోజున ఆరు రుచులతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు. ఉగాది పచ్చడిలా అన్ని కలిస్తేనే జీవితం. ఉగాది అనే పదం యుగాది అనే పదం నుంచి వచ్చింది. యుగాది అంటే సంవత్సరంలో మొదటి రోజు అని అర్థం. ఈ మొదటి చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగను జరుపుకొంటున్నాం. ఉ అంటే నక్షత్రం అని, గా అంటే గమనం అని నక్షత్రాన్ని, గమనాన్ని ప్రారంభించే రోజును ఉగాదిగా పర్వదినంగా నిర్వహించుకుంటున్నాం. ఉగాది పచ్చడికి ప్రత్యేకత ఉంది. షడ్రుచులు తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరుతో తయారు చేసేదే పచ్చడి. ముఖ్యంగా షడ్రుచులు తీపి-సంతోషానికి, చేదు-బాధకు, కారం-కోపానికి, ఉప్పు-భయానికి, పులుపు-చిరాకుకు, వగరు-ఆశ్యర్యానికి గుర్తుగా భావిస్తారు. పుర్వం సోమకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ వద్ద గ్రంథాలను దొంగలించి వాటిని సముద్ర గర్భంలో దాస్తాడు. ఆ సమయంలో మహావిష్ణువు మత్స్యావతారంలో ఆ రాక్షసుడిని సంహరించి దొంగిలించిన గ్రంథాలను బ్రహ్మకు ఇస్తాడు. ఆ గ్రంథాలతో బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజుగా పురాణాలు చెబుతున్నాయని వేద పండితులు పేర్కొంటున్నారు.

### పంచాంగ శ్రవణంతో ఎన్నో విషయాలు తెలుస్తాయి.



ఉగాది పర్వదినం రోజున చెప్పే పంచాంగ శ్రవణంతో ఈ సంవత్సరంలో జరిగే ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఈ క్రోధి నామ సంవత్సరంలో పాడి పంటలు పుష్కలంగా పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి. దైవానుగ్రహంతో అంతా మంచే జరగాలి. ఈ సంవత్సరం నవ నాయకుల స్థితిగతులను బట్టి ఫలితాలను నిర్ణయించవచ్చు. సంవత్సరంలో జరగబోయే విషయాలు, ఫలితాలను పం చాంగ శ్రవణం ద్వారా తెలుసు కోవచ్చు.

**– రవిశర్మ, బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు, షాద్‌నగర్**

### రైతన్నల ఏరువాక పండుగ...

షాబాద్ : ఈ రోజున రైతన్నలు తమ హలాల (నాగళ్లు)కు పూజలు చేసి పొలంలో ఏరువాకను చేస్తారు. ఏడాది పొడవునా తమ కుటుంబమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, సుఖమయ జీవనం సాగాలని, పంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. ఈ పండగ సందర్భంగా రైతులు ముందుగా ఏరుపూత సామగ్రిని సిద్ధం చేసుకుంటారు. ఉగాదికి ఒకటి, రెండు రోజుల ముందు చెరుకు, బెల్లం, కందమాలం, పసుపుకొమ్ములు, మోకులు, పల్పులు, ములకర్ర తదితర సామగ్రి కొనుగోలు చేసుకుంటారు. అలాగే కర్రనాగలిని కొత్తది తయారు చేస్తారు. లేదా పాత నాగలిని శుభ్రం చేస్తారు. ఉగాది రోజున నాగలితో పొలంలో ఏరుపూయడం ఆనవాయితీ. అంతకుముందు గ్రామానికి చెందిన పురోహితులు ఏ కర్రతో తయారు చేసిన నాగలి వాడాలి, ఏ దిశగా ఏరు పూయలన్నది వివరిస్తారు. పశువుల శాలలో ఉన్న ఎడ్లకు పసుపురాసి కొత్త మోకు పల్పులు, ములకర్ర, పంచామృతం, కొబ్బరికాయ తదితర సామగ్రితో పొలం వెళ్లి ఏరుపూత పనులు చేపడతారు. ఇండ్లల్లో గృహిణులు తయారు చేసిన పిండివంటలు రకాలను ఏరుపూత అనంతరం రైతు ఇంటికి రాగానే అందిస్తారు. ఆ తర్వాత వేపపువ్వు, మామిడికాయలను తమ తమ ఇండ్లకు అందజేస్తారు. గ్రామంలోని ఆల యం వద్ద నిర్వహించే పంచాంగశ్రవణ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## తాండూరుకు చేరుకున్న ఎన్నికల సామగ్రి



యాలాల, ఏప్రిల్8: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల యంత్రాలు సోమవారం తాండూరుకు చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. తాండూరు ఆర్డీవో శ్రీనివాస రావు నేతృత్వంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి తాండూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్లోని స్ట్రాంగ్ రూంకు పార్టీల నాయకుల సమక్షంలో తరలించారు.

## మోహినీ అవతారంలో స్వామివారు..



కొడంగల్, ఏప్రిల్ 8 : స్థానిక శ్రీ మహాలక్ష్మివేంకటేశ్వర స్వామి దేవాలయంలో 44వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్వామివారిని మోహినీ అవతారంలో సర్వాంగసుందరంగా అలంకరించి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటలవరకు శ్రీ వరహాస్వామి ఆలయ ప్రాగణంలో స్వామి వారి ఉయ్యాల సేవ కొనసాగింది. అనంతరం స్వామివారి గరుడోత్సవ కార్యక్రమం కొనసాగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది.

## ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు డీఆర్‌డీఏ శైలజ

కందుకూరు. ఏప్రిల్ 8 : ఉపాధి కూలీలకు వసతులను కల్పించాలని జిల్లా అదనపు డీఆర్‌డీఏ అధికారి శైలజ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని జైత్వారం గ్రామాన్ని సందర్శించి నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం గురించి పలు సూచనలను చేశారు. కూలీలకు ప్రభుత్వం రూ.300లకు పెంచిందని దానికి అనుగుణంగా కొలతల ప్రకారం పని చేయాల్సి ఉంటుందని కూలీలకు తెలిపారు. పని చేసే చోట కనీస వసతులను కల్పించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. టెంట్, మెడికల్, కిట్లు, తాగునీటి వసతలను కల్పించాలని సూచించారు. ఉపాధి కూలీలకు అడిగిన వెంటనే పనులను కల్పించాలని కోరారు. ప్రభుత్వం పెంచిన కూలీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న వారికి పనులను కల్పించడం కోసం కృషి చేయాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరిత, ఏపీఓ రవీందర్‌రెడ్డి, టీఏలు రవికుమార్, తిరుతిరావు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

కులకచర్ల, ఏప్రిల్ 8 : బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి మద్యాన్ని సీజ్ చేసిన ఘటన చౌడాపూర్ మండల పరిధిలో సోమవారం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో చౌడాపూర్ మండల కేంద్రంలో పలుదుకాణాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు వద్ద ఉన్న మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. సోమవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బెల్టుదుకాణాలపై దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన తొంబ శ్రీనయ్య, బంగ్రంపల్లి కేశవులు, ఈడిగి శివకుమార్ అనే ముగ్గురి వద్ద ఉన్న మద్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంత మద్యం పట్టుకున్నామనే విషయాన్ని స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో తెలియజేస్తామని అన్నారు.

## బాలికపై అసభ్య ప్రవర్తన..రెండేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు,ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తన తండ్రిని అకారణంగా దూషిస్తున్న తన సమీప బంధువు ఎద్దుల మహేష్‌ను ప్రశ్నించిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం రెండు సంవత్సరాల జైలుశిక్ష మరియు అయిదు వేల జరిమానా విధిస్తూ, బాలిక కుటుంబానికి లక్ష రూపాయల పరిహారం అందించాలని తీర్పునిచ్చింది. ప్రత్యేక పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. యాచారం మండలం గున్‌గుల్ గ్రామానికి చెందిన బాలిక తల్లి తన బంధువుల శుభకార్యానికి మహేశ్వరానికి వచ్చింది. అయితే మరో బంధువైన నిందితుడు మహేష్ అకారణంగా బాలిక తండ్రిని దూషిస్తుంటే ఆమె ప్రశ్నించింది. దీంతో కోపోద్రిక్తుడైన మహేష్ బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లి మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు, సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు మహేష్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## అద్దెకు గోదాంలు: తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్

పెద్దేముల్, ఏప్రిల్ 8 : మండల పరిధిలోని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నూతనంగా నిర్మించిన రెండు గోదాములను అద్దెకు ఇవ్వనున్నట్లు తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తట్టేపల్లి గ్రామంలో నిర్మించిన సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను, అదే విధంగా నాగులపల్లి గ్రామంలో ఐదువందల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను పీఏసీఎస్ నియమ నిబంధనల ప్రకారం అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. గోదాంల్లో రైస్‌మిల్ గాని, దాల్ మిల్ గాని, ఫంక్షన్ హాల్ నడపడానికి గాని ఉపయోగపడతాయని, ఆసక్తిగలవారు పూర్తివివరాల కోసం తట్టేపల్లి పీఏసీఎస్ సీఈవో రాజమౌళిని సంప్రదించాలని ఆయన సూచించారు.

## దాయాదుల చేతిలో దారుణ హత్య

యాలాల, ఏప్రిల్ 8: దాయాదుల చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని పగిడిపల్లిలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఎర్ర హన్మ ప్ప (45)కు ఇద్దరు సోదరులు. కొన్ని రోజులుగా ఆస్తి విషయమై తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యం లో జరిగిన హత్యకు దాయాదులే కారణమని గ్రామస్తుల ద్వారా తెలుస్తున్న ది. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, E.G. గోవిందరాజు, S/o. Late E. గణేష్, R/o. ఇం.నెం. 3-8-443, ప్లాట్ నెం. 39, రోడ్ నెం. 1, సూర్యోదయ కాలనీ, ఎల్.బి. నగర్, రంగారెడ్డి జిల్లా. నేను 30-03-2024 నాడు మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై ఇబ్రహీంపట్నంలో గల నా ప్లాట్‌ను చూసుకొని తిరిగి వచ్చుచుండగా, మార్గమధ్యలో అంబేద్కర్ చౌరస్తా, ఇబ్రహీంపట్నం వద్దకు రాగానే నా ప్లాట్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ Miss అయినట్టుగా గమనించాను. నా ప్లాట్ No. 55, 133 Sq.yds., సర్వే నెం. 50కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1616/2006 of 02-02-2006, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన డాక్యుమెంట్స్ పోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు:

**Cell: 9912041456/ 8919873794**

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### ఓటు హక్కు వినియోగించుకోవాలి

బడంగ్‌పేట, ఏప్రిల్8: ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘు తెలిపారు. సోమవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఓటు వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్ బాబు, ఆర్వో చంద్ర శేఖర్, టీఎంసీ, ఆర్‌పీలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది కవి సమ్మేళనం

కొండాపూర్, ఏప్రిల్ 8: క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకొని చందానగర్‌లోని విశాఖ శారదా పీఠ పాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కిటెక్ట్ యెండూరి సురేశ్ బాబు సౌజన్యంతో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి జ్యోతి ప్రదీపన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య వంగర త్రివేణి ముఖ్య అతిథిగా హాజరై కవి సమ్మేళనంలో పాల్గొన్న 60 మంది కవి పుంగవులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బాశెట్టి లత, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, అవధాని ములుగు అంజయ్య, కటకం వెంకటరావు శర్మ, హాస్య బ్రహ్మ శంకరనారాయణ, తాడిబోయిన రామస్వామి యాదవ్ పాల్గొన్నారు.

## వసతుల కల్పనలో సర్కార్ విఫలం

కందుకూరు. ఏప్రిల్ 8 : ఉపాధి హామీ కూలీలకు వసతులను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంకగాల్ల కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బానోతు సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు అధికారులు కూలీలు పని చేసే చోటనే వసతులను కల్పిస్తున్నట్లు చెబుతున్న ఇక్కడ మాత్రం ఆచరణలో అమలు కావం లేదని విమర్శించారు. మండు టెండల్లో కూలీలు పనులు చేస్తున్నారని. కనీసం తాగునీరు లేక పోతున్నారని విమర్శించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు.మెడికట్లు కిట్లు. టెంట్లను ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. ఉపాధి కూలీలకు రోజు వారి వేతనం రూ 600లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ప్లే స్లిప్పులు ఇవ్వడం లేదని డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారని తక్షణమే పెండింగ్‌లో ఉన్న డబ్బులను చెల్లించాలని కోరారు.కుంటుబానికి సంవత్సరానికి 200పని దినాలను కల్పించాలని పేర్కొన్నారు.రెండు పూటల ఫొటో విధానాన్ని రద్దు చేసి ఉదయం పూటనే మాత్రమే పనులను కల్పించాలని కోరారు. గతంలో ఉన్న మేట్లను తీసుకోవాలని తెలిపారు.కొలతలతో సంబంధం లేకుండా దినసరి కూలీని రూ. 600చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంటి శేఖర్. గాదె సత్తయ్య.భూమేష్. సురేష్.తధితరులు పాల్గొన్నారు.

## 10న 5కే రన్...

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌లో ఈనెల 10న ''నేను తప్పకుండా ఓటు వేస్తాను'' ''ఐ ఓట్ ఫర్ ష్యూర్'' అనే నినాదంతో 5కే రన్ నిర్వహిస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఏప్రిల్ 10న ఉదయం 6గంటలకు 5కే రన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుంచి హైటెక్స్ రోడ్, మెటల్ చార్మినార్ వరకు సాగుతుందన్నారు. అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా 5కే రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటాలని, వివిధ శాఖల అధికారులతో పాటు డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, విద్యార్థినీ,విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

